సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

పార్కింగ్ పరేషాన్

అల్లిపురంలో ఎక్కడ చూసినా ఆటోలే కానవస్తున్నాయి. రోడ్డుకి ఇరువైపులా అడ్డదిడ్డంగా ఆటోలు నిలపడం వల్ల వాహనాల రాకపోకలకు, పాదచారులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో నిలిపి ఉన్న ఆటోల్లో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.



కుమ్మర వీధికి వెళ్లే దారిలో రోడ్డు మలుపులో నిలిపి ఉన్న ఆటో

- అల్లిపురం వీధుల్లో ఆటోల తిష్ట
- రాకపోకలకు ఇబ్బంది
- రాత్రిళ్లు ఆటోల్లో అసాంఘిక కార్యకలాపాలు
- పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి



బంగారుమెట్ట జంక్షన్‌లో రోడ్డు మలుపులో నిలిపి ఉన్న ఆటోలు



అల్లిపురం న్యూ స్కూల్‌కు వెళ్లే దారిలో నిలిపి ఉన్న ఆటోలు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, కుమ్మరవీధి, కంఠంవారి వీధి, అమ్మవారి వీధి తదితర ప్రాంతాలతో పాటు 34వ వార్డులో కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, జెండా చెట్టు వీధి, భూపేష్‌నగర్, చలువతోట, నరహరి వీధి తదితర ప్రాంతాల్లో ఆటోలు ఎక్కడికక్కడ నిలిపివేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఉపాధి నిమిత్తం ఆటోలు నడుపుకునే వారు ఎవరికీ ఇబ్బంది కలగకుండా వాటిని నిలుపుకుంటే మంచిదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు కూడా రాత్రి సమయాల్లో ఆటోల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నరహరి వీధిలో పరిస్థితి మరీ దారుణం..

జీవీఎంసీ 34వ వార్డు నరహరి వీధిలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఎక్కడెక్కడి నుంచో ఆకతాయిలు వచ్చి ఆపి ఉన్న ఆటోలు, ఇళ్ల ముందు మద్యం సేవిస్తూ గొడవ చేస్తున్నారని వాపోతున్నారు. మద్యం తాగుతూ ద్విచక్ర వాహనాలకు మరమ్మతులు చేస్తున్నారని, దీని వల్ల స్థానికులకు కంటి మీద నిద్ర లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఒకటి రెండు సార్లు వచ్చి వారిని వెళ్లగొట్టారని, రెండు రోజులు ప్రశాంతంగా ఉన్నా తర్వాత మళ్లీ మామూలుగా మారిపోయిందని వాపోతున్నారు. నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటో పార్టులు విప్పుకుపోతున్నారు..

కొబ్బరితోటలో నిలిపి ఉన్న ఆటోల్లో మద్యం తాగడమే కాకుండా ఆటోల పార్టులు విప్పుకుని పోతున్నారని స్థానికులు తెలిపారు. ఇలా పలు మార్లు జరిగినట్లు తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఒకటి, రెండు రోజులు మినహా పరిస్థితి మళ్లీ మామూలేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరితోటలో బెల్ట్ షాపుల వల్ల పరిస్థితి మరీ దారుణంగా మారిందంటున్నారు.

ఇబ్బందిగా ఉంటుంది..

పగలు, రాత్రి వీధుల్లో ఆటోలు నిలిపేస్తున్నారు. అవి కూడా రోడ్డు మలుపులో నిలపటం వల్ల వచ్చే, పోయే వాహనాలకు ఇబ్బందిగా ఉంటుంది. ఎదుటి వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి.

– ఎంవీఎస్ అప్పారావు, బంగారుమెట్ట

ఇష్టానుసారం ఆటోలు నిలిపేస్తున్నారు..

పాడైన ఆటోలను రోడ్డుపై నిలిపి ఉంచడంతో స్థానికులు వారి వాహనాలు నిలుపుకోలేని పరిస్థితి. రోజులు, నెలల తరబడి ఆటోలు వీధుల్లో నిలిపివేయటంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వాటిని తొలగిస్తే కొంత వరకు పరిస్థితి మెరుగుపడుతుంది.

– బి.రాజు, బంగారుమెట్ట

చలువతోటలో పరిస్థితి దారుణం..

చలువతోట, నరహరిదొడ్డి, ఎన్‌టీఆర్ కాలనీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా మారింది. రాత్రి సమయాల్లో వీధుల్లో ద్విచక్ర వాహనాలు ఎక్కడెక్కడి నుంచో తీసుకువచ్చి రిపేర్లు చేస్తున్నారు. అంత వరకు బాగున్నా మద్యం సేవించి అల్లరి చేస్తున్నారు. అందు వల్ల ఇబ్బందిగా ఉంటుంది.

– ఎన్‌వీ రామచంద్రరావు, నరహరిదొడ్డి

నైట్ బీట్‌లు వేస్తున్నాం..

ప్రతి రోజు నైట్ రౌండ్స్‌తో పాటు పగటి పూట కూడా స్పెషల్ టీమ్‌లు తిరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపడతాం. వాటిని తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆటోల్లో మద్యం సేవించే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. మరిన్ని టీమ్స్ ఏర్పాటు చేస్తాం.

– బి.తిరుమలరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, టూటౌన్

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

జీవీఎంసీ షెల్టర్‌కు మహిళ తరలింపు



షెల్టర్ నిర్వాహకులతో రాధ

సీతమ్మధార: భర్త విడాకులు తీసుకుని వేరే పెళ్లి చేసుకున్నాడనే మనస్థాపంతో బొబ్బిలి రాధ (30) అనే మహిళ విజయవాడ నుండి విశాఖ వచ్చేసింది. భర్త విడాకులు తీసుకోవడం, తల్లి చనిపోవడంతో ఒంటరి అయిన ఆమె వారం రోజుల క్రితం విశాఖ చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆమె వద్ద గల రూ. 10 వేల నగదుతో ఉన్న బ్యాగును ఎవరో దొంగిలించారు. దీంతో ఆమె వేరే దారి లేక ఆర్టీసీ బస్టాండ్ దగ్గరే ఉంటోంది. 2వ పట్టణ పోలీసులు ఆమెను గమనించి జీవీఎంసీ ఏయూటీటీ మహిళా షెల్టర్‌కు అప్పగించారు.

క్లుప్తంగా

మాయాదేవి మృతి పట్ల పలువురి సంతాపం

మహారాణిపేట: ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధురాలు, ఎంఎల్‌బీటీ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఆర్. మాయాదేవి మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ప్రముఖ సంఘ సేవకురాలు ఎంఎల్‌బీటీ ట్రస్ట్ అధ్యక్షురాలు పి. అంతర్వేది, సభ్యురాలు కె. అశోక కుమారి, ఎంఎస్ మూర్తి, బాబాపు సేవా సంఘం ప్రతినిధులు, గాయత్రీ విద్యా పరిషత్ ప్రతినిధులు డీవీఎస్ కామేశ్వరరావు, ఆచార్య పి. రాజగణపతి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య పి. రాజు గణపతి మాట్లాడుతూ బాల్యం నుంచి తమ కుటుంబంతో దిగుమర్తి, మల్లెమడుగు కుటుంబాలకు ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. బాల్యం నుంచే మాయాదేవి తన సేవలు అందించినట్లు చెప్పారు. విశాఖతో పాటు బీహార్, రాంచీ వంటి ప్రాంతాల్లో కూడా మాయాదేవి సేవలు చేసినట్లు చెప్పారు. మల్లెమడుగుల బంగారయ్య, లలితాంబల కుటుంబాలు సమాజానికి అందించిన సేవలు అద్వితీయం అన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథ స్వామి ఆలయంలో 2500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దాన్వి కళా నిలయం వారిచే నిర్వహించిన కూచిపూడి భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందగిరినగర్‌లో ఉచిత వైద్య శిబిరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ఎండీ డాక్టర్ కాండ్రేగుల రామ్‌కుమార్ సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ నెల మొదటి ఆదివారం నందగిరినగర్‌లో ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, 2024 సంవత్సరం చివరి ఆదివారం కావడంతో శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 150 మందికి జనరల్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, నర్సింగ్ స్టాఫ్ సుజాత, సిబ్బంది దినేష్, నందగిరినగర్ సేవా సంఘం అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి గౌరీశంకర్ పాల్గొన్నారు.

అలరించిన కోలాట ప్రదర్శన



శ్రీలలితా పీఠంలో కోలాటం ప్రదర్శిస్తున్న యోగ చైతన్య బృందం సభ్యురాళ్లు

సీతంపేట : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో యోగ చైతన్య కోలాట బృందం (శంకరమఠం) చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తుల ఎదుట బృంద సభ్యులు హరినామ సంకీర్తనలకు కోలాటంతో నీరాజనం అర్పించారు. బృంద నాయకురాలు కె.పద్మజ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ వీరిని సత్కరించారు. అమావాస్య సందర్భంగా సోమవారం ఉదయం 9 : 30 గంటలకు అధర్వణ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తామని కృష్ణసేన్ తెలిపారు.

రాజ్యాధికారంతోనే బీసీ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్

దాబాగార్డెన్స్: రాజ్యాధికారం ద్వారానే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ మెంబర్ వరకు జరిగే అన్ని ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించాలన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు దక్కాల్సిన వాటాని ఓసీ సామాజిక వర్గాలు అన్ని రంగాల్లో లాక్కుంటున్నాయని మండిపడ్డారు. అందుకోసం జనగణన జరిపి, కులాల లెక్కల మేరకు అన్ని రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదని, జాతీయ కులగణన జరపలేదని, బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. రాజకీయ చైతన్యం, ఓటు చైతన్యంపై ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బ్లూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు అమీనుద్దిన్, ప్రధాన కార్యదర్శి కామేట భూపాల్, కార్యదర్శి బానోతు లింగన్న, అధికార ప్రతినిధి మధు భూంపల్లి, రావణ్, రాంబాబు, సందీప్‌గౌడ్, కొత్త జంగయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

దాబాగార్డెన్స్: బీఆర్ అంబేడ్కర్ ఫొటో కరెన్సీ నోట్లపై ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు 'రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం' పుస్తకాన్ని రచించిన అంబేడ్కర్ బ్యాంకింగ్ రంగం అభివృద్ధికి ఎన్నో సూచనలిచ్చారన్నారు. అవి వాస్తవమని గ్రహించి 1935 ఏప్రిల్ ఒకటిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడిందంటే అది అంబేడ్కర్ చలవేనని, ఆర్‌బీఐ ఏర్పడి 90 ఏళ్లయినా కరెన్సీ నోట్లపై ఆయన ఫొటో ముద్రించకపోవడమంటే చరిత్రను వక్రీకరించడమే అని పరశురామ్ అన్నారు. ఎనిమిదేళ్లుగా దీనిపై పోరాడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు అంబేడ్కర్ ఫొటో సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పరశురామ్ తదితరులు



ఎట్టకేలకు తారకరామనగర్ బస్టాప్‌కు హంగులు దిద్దుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పోర్టు దరి ఉన్న ఈ బస్టాప్‌కు కనీసం నీడ కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ఈ విషయం 'ఇదీ బస్టాపే' పేరిట సాక్షిలో ప్రచురితమయింది. దీంతో అధికారులు బస్టాప్‌కు హంగులు దిద్దుతున్నారు.

– జగదాంబ

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- కలుసుకున్న సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు
- పాత రోజులను గుర్తుకు తెచ్చుకుని ఆటపాట



పూర్వ విద్యార్థులు ఒక్కటైన వేళ

దాబాగార్డెన్స్: ఆ పాఠశాలలో చదివిన వారంతా ఏడాదికో.. రెండేళ్లకో కలుస్తుంటారు. లేదంటే వాట్సప్‌లో తరచూ విషెష్ చెప్పుకుంటారు. 36 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలలో 1988లో పదో తరగతి పూర్తి చేసుకున్న వీరంతా నగరంలోని ముడసర్లోవ పార్కులో కలుసుకున్నారు. ఉద్యోగం.. ఉపాధి.. ఇలా అన్ని విషయాలు చర్చించుకున్నారు. అప్పటి అధ్యాపకులు నేర్పిన పాఠాలు.. విద్యనందించిన పాఠశాల కోసం చర్చించుకుని సంబరపడ్డారు. ఈ బ్యాచ్ విద్యార్థుల్లో అనేక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అనేక రంగాల్లో స్థిరపడ్డారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉంటున్నారు. వీరంతా 36 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం పేరిట ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో పని చేసిన ఉపాధ్యాయులు.. ప్రధానంగా విద్య అందించిన గురువులను మనసారా గుర్తుకు తెచ్చుకున్నారు.

ఆ రోజులే వేరు..



ఆ రోజుల మనుషులు వేరు. అప్పటి భావాలు వేరు. అంతా ఆప్యాయత.. మమకారమే. పలకరింపులు కూడా పాత పలకరింపులే. అరే.. ఒరే.. అని పిలుపులు కావు. మంచి మర్యాదలతో.. పేర్లు పెట్టుకుని పిలుచుకుంటూ ఎంతో ఆనందంగా కలుసుకున్నారు.

– మహ్మద్ అలీ, పూర్వ విద్యార్థి సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల

సంతోషంగా ఉంది..



1988లో టెన్త్ క్లాస్ పాస్ అయిన తర్వాత 36 ఏళ్ల అనంతరం పాత మిత్రులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందర్నీ ఒక తాటిపైకి తీసుకొచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గర్వంగా ఉంది.

– జోగా ఉదయ్ శంకర్, పూర్వ విద్యార్థి

ఈ కలయికను వర్ణించలేను..



సెయింట్ ఆంథోనీ హైస్కూల్లో 36 ఏళ్ల కిందట చదువుకున్న మేమంతా ఈ రోజు ఈ సమ్మేళనంలో కలుసుకోవడం చాలా సంతోషదాయకం. ఎన్ని మాటల్లో చెప్పినా ఈ అపురూప కలయికను వర్ణించలేను. ఈ విధంగా ప్రతి సంవత్సరం అందరం కలిసి ఆనందాన్ని రెట్టింపు చేసుకోవాలని కోరుతున్నాను.

– కోన ప్రభాకర్, పూర్వ విద్యార్థి

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

మురళీనగర్ : రోజూ కనీసం అరగంట సేపు నడవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చని కార్డియాలజిస్టు డాక్టర్ కాశీనాథుని గణేష్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని పలు ఆరోగ్య సూచనలు చేశారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించుకోవాలన్నారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. 50 ఏళ్లు దాటిన వారు ఏడాదికోసారి ఈసీజీ, ట్రెడ్‌మిల్, 2డీ ఎకో పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ శరీరంలో అసాధారణ మార్పులు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సాధారణ వ్యాధుల నిపుణుడు డాక్టర్ మల్లా అలరింద్ మాట్లాడుతూ ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం చేయాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో ఉపాధ్యక్షులు మళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్ నానుపాత్రుని ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, రోణంకి నాగేశ్వరరావు, సబ్బినేని రామమోహనరావు పాల్గొన్నారు.

మూర్తి చేసిన పోరాటం మరువలేనిది



మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు తదితరులు

దాబాగార్డెన్స్: ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు కేఎస్ఎన్ మూర్తి చేసిన పోరాటం మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ బాషా కొనియాడారు. ఇటీవల మృతి చెందిన మూర్తి సంస్మరణ సభ ఆదివారం కనకమహాలక్ష్మీ దేవస్థానం సమీపాన గల స్వామి వివేకానంద విద్యానికేతన్ స్కూల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ మురళీ మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మూర్తి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్వర్ బాషా నేతృత్వంలో నిర్వహించిన సంతాప సభలో విశాఖ జిల్లా నుంచే కాక రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రైవేట్ విద్యా సంస్థల కరస్పాండెంట్లు, మూర్తి అభిమానులు, అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మూర్తి సతీమణి ప్రమీల మాట్లాడుతూ కుటుంబంకన్నా ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడ, అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ కోసం అధిక ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. ఆయన మృతి కేవలం తమ కుటుంబానికే కాదని, ప్రతి ప్రైవేట్ విద్యా సంస్థకు తీరని లోటన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ మురళీ మనోహర్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ ప్రతినిధులు సుందరం, వసంతలక్ష్మి, పి. కిషోర్, బి. మణికుమార్, ఆర్. శ్రీనివాస్, కొణతాల శ్రీనివాస్, సీహెచ్‌వీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి కదంబం సమర్పణ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కదంబం ప్రసాదం సమర్పించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన చేశారు. మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణతో గోదాదేవి అమ్మవారి విగ్రహంతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవాకాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరుపున శ్రీరంగనాథుడికి 14వ పాశురం విన్నవించారు. అనంతరం వైభవుడికి కదంబం ప్రసాదాన్ని సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతోపాటు పాశురం విన్నవించారు.

తెలుగు సాహిత్యానికి ఆదరణ



మాట్లాడుతున్న రచయిత ఈతకోట సుబ్బారావు

సీతంపేట : సాఫ్ట్‌వేర్ రంగం వచ్చినా తెలుగు కథలకు, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదని రచయిత ఈతకోట సుబ్బారావు అన్నారు. తటవర్తి భారతి స్మారక సాహిత్య సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కథ, కథనం అంశంపై ప్రసంగించారు. తారు రోడ్డు రాకముందే కథలు ఇక్కడ పుట్టాయని, మహాకవి ఆరుద్ర అన్నట్టు తల్లి ఒడిలో నుంచే కథలు నేర్చుకుంటామని తెలిపారు. కరోనా, సోషల్ మీడియా పుణ్యమా అని ఒక రకంగా తెలుగు భాష బతికి బట్ట కట్టిందన్నారు. కథల్లో మానవీయ కోణం ఉండాలని, మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న తరుణంలో కథల్లో కూడా మార్పు వచ్చిందన్నారు. తెలుగు సాహిత్యంలో ఎంతో మంది కథలు రాసే వారు ఉన్నారని, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదన్నారు. ప్రముఖ రచయిత ఎం.సుగుణరావు మాట్లాడుతూ పాలకులు చేపట్టే విధానాల వల్ల రకరకాల సంస్కరణలు వచ్చాయని, ఫలితంగా కొన్ని కుల వృత్తులు దూరమయ్యాయని తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారి జీవనం ఏ విధంగా మారిందో తెలిపే కథలు వచ్చాయన్నారు. అలాగే గోద్రా అల్లర్లు తర్వాత వచ్చిన కథ, అమెరికన్ రచయిత జేమ్స్ రాసిన నవల గురించి వివరించారు. కథా పఠనం, రికార్డింగ్‌లో మెలకువలపై రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు ప్రసంగించారు. విమర్శ, విశ్లేషణ, సమీక్ష అనే అంశాలపై సీహెచ్. సుశీలమ్మ, డి.వి.సూర్యారావు మాట్లాడారు. కథల పోటీలు, పత్రికాధిపతుల సలహాలు అంశంపై సంపాదకులు గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కథల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పలువురికి పురస్కారాలు

ఈ సందర్భంగా 14 మంది కవులు, రచయితలకు తటవర్తి భారతి సాహిత్య పురస్కారాలు అందజేశారు. దాట్ల దేవదానం రాజు, ఈతకోట సుబ్బారావు, ఎం.సుగుణరావు, సీహెచ్.సుశీలమ్మ, డి.వి. సూర్యారావు, రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు, ఇందూ రమణ, గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు, తటవర్తి శంకరరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్ రెడ్డి పురస్కారాలు అందుకున్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com